కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మంచి పథకాలు

- ఆర్థిక ఇబ్బందులతో చెక్కుల అందజేతలో ఆలస్యం
- మంత్రి కొండా సురేఖ
- తులం బంగారం అందజేయాలి
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూన్ 19: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మంచి పథకాలని, ప్రభుత్వాలు మారినా పథకాలు కొనసాగించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నర్సాపూర్, కొల్చారం, శివంపేట్ మండలాలలకు చెందిన 171 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పని చేస్తున్నదన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా కల్యాణలక్ష్మితో తులం బంగారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి చెక్కులు పంపిణీ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. బడ్జెట్ సమావేశంలో తులం బంగారం కోసం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులతో ఈ చెక్కులకు ఆటంకం కలిగిందన్నారు. ఇకమీదట సకాలంలో అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టి అర్హులకు పంపిణీ చేయకపోవడంతో కూలిపోయి, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి అర్హులకు అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులకు సంతకాలు పెట్టే స్వేచ్ఛ ఉండేది కాదని, నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి స్వేచ్ఛను కల్పించారన్నారు.

హామీలన్నీ నెరవేర్చాలి: ఎమ్మెల్యే

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆడబిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందజేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గుర్తుచేశారు. ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తులం బంగారం ఇవ్వడం లేదని, కచ్చితంగా ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన మొదటిసారి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్నామన్నారు. పెండింగ్ కలల్యాణలక్ష్మి, షాదీముబారక్ డబ్బులను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. అభివృద్ధిలో భాగంగా కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించక పోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను నెరవేర్చాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ హయాంలోనే సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భవనాలు నిర్మించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహిసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్, ఎంపీపీ జ్యోతి, నీలం మధు, ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి, చంద్రాగౌడ్, బాబ్యానాయక్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

నర్సాపూర్ మున్సిపాలిటీకి చెందిన చిన్నారి ధనుశ్రీ చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రూ.1.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును నర్సాపూర్‌లో అందజేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్, శివకుమార్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటపై కలెక్టర్ పాట

కలెక్టర్ రాహుల్‌రాజ్ సొంతంగా బడిబాట నేపథ్యంలో చిట్టి.. పొట్టి అడుగులు.. అనే పాటను రాశారు. బుధవారం నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఈ పాటను ఆవిష్కరించారు. సర్కారు బడిపై ప్రేమ, పేద పిల్లలపై మక్కువతో కలెక్టర్ ఈ పాట రాసి, కూర్పు చేసి, ట్యూన్ అందించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఇన్‌చార్జి మంత్రి అభినందించారు. ఈ పాటను ప్రజలు, పిల్లలు తప్పకుండా ఆదరిస్తారని, కలెక్టర్ గొప్ప ఆశయం కోసం పరితపిస్తున్నారన్నారు.

వాగ్వాదానికి దిగిన మంత్రి, ఎమ్మెల్యే

ఉదయం గొడవ, సాయంత్రం స్నేహం

నర్సాపూర్, జూన్ 19: ప్రొటోకాల్ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన రసాభాస మంత్రి, ఎమ్మెల్యే ఆలింగనంతో చల్లబడింది. మంత్రి కొండా సురేఖ, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కొల్చారంలో బడిబాట, మండల పరిషత్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అక్కడ ప్రొటోకాల్ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య నువ్వా-నేనా అన్నట్టు రసాభస జరిగింది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఎంపీ భవన ప్రారంభోత్సవం వద్ద ఎమ్మెల్యే, మంత్రిని నిలదీశారు. బడిబాటలో ఎంపీటీసీకి కుర్చీ ఇవ్వనందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి, ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమయ్యే ముందు మంత్రి, ఎమ్మెల్యే ఆలింగనం చేసుకోవడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు అవాక్కయ్యారు.

నర్సాపూర్‌లో ఆలింగనం చేసుకుంటున్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

ఫర్టిలైజర్ షాపును తనిఖీచేస్తున్న జిల్లా వ్యవసాయధికారి గోవిందు

-జిల్లా వ్యవసాయధికారి గోవిందు

కొల్చారం, జూన్19: నకిలీ విత్తనాలు అమ్మితే ఫర్టిలైజర్ షాపు యజమానులపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయధికారి గోవిందు తెలిపారు. బుధవారం కొల్చారం మండలం దుంపలకుంటలోని ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రైతులకు పంపిణీ చేసిన విత్తనాల సీడు, రసీదు, స్టాక్ రిజిష్టారును పరిశీలించారు. ఎనగండ్ల గ్రామంలో పత్తి పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రసీదులు తీసుకుని కొనుగోలు చేయాలన్నారు. ఏవో శ్వేతాకుమారి ఉన్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

- ఏడీఏ విజయ నిర్మల

చిన్నశంకరంపేట, జూన్ 19: విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏడీఏ విజయనిర్మల సొసైటీ సీఈవోలకు బుధవారం సూచించారు. చిన్నశంకరంపేట, జంగరాయి, మడూరు సొసైటీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి, బస్తాలను సమీక్షించారు. అనంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, రైతులు తప్పనిసరిగా రసీదులు పొందాలని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల బస్తాలను ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో మౌనిక శ్రీనివాస్ ఉన్నారు.

ఆయిల్ పామ్ పంటలతో అధిక లాభాలు

అజ్జమర్రిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య

చిలిపిచెడ్, జూన్ 19: ఆయిల్ పామ్ పంటలు సాగు చేస్తే నీటి ఆదాతో పాటు అధిక లాభాలు పొందుతారని జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య తెలిపారు. బుధవారం మండలంలోని అజ్జమర్రి గ్రామంలో రైతు పాండు రంగారెడ్డి సాగు చేసిన ఆయిల్ పామ్ పంటను లివింగ్ ఫుడ్ ఇండియా ప్రైవేట్ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయిల్ పామ్ సాగు చేసే మండలంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి నర్సయ్య మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న ఆయిల్ పామ్ తోటలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్యం జాగ్రత్తలు, పంట సాగుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ హెచ్‌వో రామకృష్ణ, ఆయిల్ పామ్ మేనేజర్ కృష్ణ, సిబ్బంది రాకేశ్, ఏఈవో భూపాల్, రమ్య, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీయోద్దీన్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందజేత

బాధితులకు చెక్‌ను అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జూన్ 19: జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థానాల సముదాయంలో డైలీ లోక్ అదాలత్ నిర్వహించారు. మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులో ఇరు పక్షాల వారిని రాజీ కుదర్చి, బాధితులకు రూ.12లక్షలు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా నష్టపరిహారం అందజేశారు. డైలీ లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌గా న్యాయవాది శ్రీపతిరావు ఉన్నారు. కార్యక్రమంలో పిటిషనర్ తరపు న్యాయవాది బాలయ్య, ఇన్సూరెన్స్ న్యాయవాది శ్రీనివాస్, లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి: టీపీటీఎఫ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతుల ప్రక్రియ తీవ్ర నష్టాన్ని కలిగించిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగయ్య, వెంకట్రాంరెడ్డి, డీఈవో రాధాకిషన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ ప్రక్రియ విద్యార్థులు, ఉపాధ్యాయులకు నష్టాన్ని మిగిల్చిందన్నారు. ప్రత్యక్ష పద్ధతిలో ఉద్యోగోన్నతులు నిర్వహించాలని చేసిన డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకే జిల్లాలో ఇంకా చాలా ఖాళీలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా తప్పులు సరి చేస్తూ మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయాలని కోరామన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి: సీఐటీయూ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: కార్మిక రంగం, మత సామరస్యత, లౌకిక విలువలను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం పేరు మీద కార్మిక వర్గం విడిపోరాదని, దళితులపై నేటికీ అంటరానితనం, కులవివక్షత కొనసాగుతున్నదని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే మన హక్కులు సాధించబడుతాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ 1970 నుంచి నేటి వరకు జరుగుతున్న ఉద్యమాల్లో సీఐటీయూ ఐక్య పోరాటాలకు రథసారధిగా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజు, ఉపాధ్యక్షులు మల్లేశం, బాలమణి, నాగరాజు, నర్సమ్మ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొల్చారం, జూన్ 19: డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతన్‌శెల్లిపల్లిలోని ఏడుపాయల వైన్స్ వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాపన్నపేట మండలం కొడిపాక గ్రామానికి చెందిన బాబు(40) బైక్‌పై సొంత పనుల నిమిత్తం ఏడుపాయల చౌరస్తా వద్దకు వస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న డివైడర్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ చేయూత

శివ్వంపేట, జూన్ 19: మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన చెక్కల నర్సమ్మ కుటుంబానికి, కత్తి నాగమ్మ కుటుంబానికి జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా బుధవారం పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

అద్దె ఇవ్వలేదని తహసీల్ కార్యాలయానికి తాళం

నిజాంపేట, జూన్ 19: నిజాంపేట తహసీల్ కార్యాలయం కొన్నేండ్లుగా అద్దె ఇంట్లో కొనసాగుతున్నది. 18 నెలల నుంచి ఇంటి అద్దె చెల్లించడం లేదు. దీంతో ఇంటి యజమాని శ్రీధర్‌రెడ్డి పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా సిబ్బంది స్పందించలేదు. ఈ క్రమంలో విసిగెత్తిన ఆయన బుధవారం తహసీల్ కార్యాలయానికి తాళం వేశారు. దీంతో ఉదయం కార్యాలయానికి వచ్చిన రెవెన్యూ సిబ్బంది చేసేదేమీ లేక ఆరు బయటే ఉండిపోయారు.

సీసీ రోడ్లను నాణ్యతతో వేయాలి: ఎంపీపీ

చేగుంట, జూన్ 19: నాణ్యతతో కూడిన సీసీ రోడ్లను నిర్మించాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. చేగుంటలో జడ్పీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు బుధవారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్నె పాండు, నాయకులు దాసుజు కృష్ణ, అయిత రామలింగం, అరవింద్, పుట్ట మహేశ్, దొడ్ల కృష్ణ, వంజరి శ్రీనివాస్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT: MEDAK
A.S No. 7 OF 2021
BETWEEN:
A L Sudharshan & company and another ...Appellants
AND
A. Narayana and others ...Respondents
A.S No. 8 OF 2021
BETWEEN:
AL Sudharshan & company ...Appellant
AND
Gurram Baikadi Yadamma (died) and others ...Respondents
A.S No. 9 OF 2021
BETWEEN:
Papakannu Vijayabharathi and 2 others ...Appellants
AND
Gurram baikadi yadamma died and others ...Respondents
I.A. NO. 72 OF 2021
IN
A.S. NO. 8 OF 2021
BETWEEN:
AL Sudharshan & company ...Appellant
AND
Gurram Baikadi Yadamma (died) and others ...Respondents
I.A. NO. 74 OF 2021
IN
A.S. NO. 9 OF 2021
BETWEEN:
Papakannu Vijayabharathi and 2 others ...Appellants
AND
Gurram baikadi yadamma died and others ...Respondents
To :-
1. Gurram Baikadi Narayana S/o Late Ramayya, Aged about 58 years, Occ: Retired Railway Employee, R/o Masaipet Village and Mandal, Medak District.
2. Gurram Baikadi Ravi S/o Late Ramayya, aged about 53 yrs, Occ: Agriculture, R/o Masaipet Village and Mandal, Medak District.
... RESPONDENTS 18,19 16,17
Whereas your presence is necessary for the above said appeals which are pending on the file of Hon'ble Principal District Judge, Medak , several times the summons were sent to you both but you are intentionally avoiding the service of notices and summons.
Therefore you both are informed to appear before the Hon'ble Principal District Judge, Medak on 02-07-2024 at about 10.30 AM, failing which the matter will be decided in your absence.
PLACE: MEDAK
DATE : 19-06-2024
// BY ORDER OF THE COURT //
FROM
C.POCHAIAH
B.Com, LL.B
Advocate, MEDAK.

సివిల్స్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తెలంగాణ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు నేటి నుంచి జూలై 10వ తేదీలోగా http://tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 21న నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి, పది నెలల పాటు ఉచిత భోజన వసతితో కోచింగ్ ఇవ్వబడుతుందని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు జనరల్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 9849526767 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

రామాయంపేట, జూన్ 19: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. సన్నబియ్యంతో అన్నం, ఫీజులేకుండా విద్య, గ్రూపుల్లో పరిమిత స్థాయిలో విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలతిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ తీసుకోవాలన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు చేస్తాం

శివ్వంపేట, జూన్ 19: ప్రొటోకాల్ పాటించని శివ్వంపేట తహసీల్దార్ శ్రీనివాస్‌చారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండలానికి కల్యాణలక్ష్మి చెక్కులు 97 మంజూరయ్యాయని, వాటికి సంబంధించి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా చెక్కులు పంపిణీ చేయడం సరికాదని అన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం

హిందూ సామ్రాజ్యవాద దినోత్సవం సందర్భంగా శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం

రామాయంపేట, జూన్ 19: హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఛత్రపతి శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బుధవారం రామాయంపేటలోని జాతీయ రహదారిపై ఉన్న శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుట్టి మల్లేశం, నవాత్ రాజు, శంకర్‌గౌడ్, కొడపర్తి నరేందర్, దయానంద్‌రెడ్డి, దామోదర్‌రావు, దిలీప్, కార్తిక్, గిరి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందిస్తున్న పంచాయతీ కార్మికులు

చిన్నశంకరంపేట, జూన్ 19: పంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీవో దామోదర్‌కు వినతిపత్రాన్ని అందించారు. నాలుగైదు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు రావాల్సిన వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నందిగామలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

నిజాంపేట, జూన్ 19: మండలంలోని నందిగామలో బుధవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించినట్లు కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు. 15 నుంచి 49 ఏండ్ల వయస్సున్న మహిళల ఆరోగ్య స్థితి, 0 నుంచి 5 వయస్సున్న చిన్నారుల్లో బరువు, ఎత్తు, వ్యాక్సినేషన్ అంశాలను సేకరించారు. సర్వేలో సూపర్‌వైజర్ నారాయణమూర్తి, సభ్యులు ఆదిలక్ష్మి, భవాని, రమ్య, ల్యాబ్ టెక్నిషియన్ సంతోశ్, పుష్ప, ఆశావర్కర్ గౌరి ఉన్నారు

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

మెదక్‌రూరల్, జూన్ 19: శ్రీవశిష్ట యోగా కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహిస్తునట్లు యోగా గురువు ఆకుల రవి తెలిపారు. శుక్రవారం 21న ఉదయం 5.30 నుంచి 7గంటల వరకు యోగా దినోత్సవంలో మెదక్ పరిసర ప్రాంతాల వారు పాల్గొనాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి: ఎంపీపీ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట, జూన్19: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భాగ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వానకాలంలో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు కాల్వలు, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పైపులైన్ లీకేజీ ఉంటే వెంటనే వాటికి మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో దామోదర్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాట్ చిప్స్ దుకాణానికి జరిమానా

దుకాణదారుడికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: మెదక్‌లోని శ్రీకృష్ణ హాట్ చిప్స్ దుకాణానికి జరిమానా విధించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కానిస్టేబుల్ నాగరాజు మంగళవారం శ్రీకృష్ణ హాట్ చిప్స్ దుకాణంలో పల్లిపట్టీలు తీసుకెళ్లాడు. పల్లి పట్టీల్లో రబ్బరు బ్యాండ్లు ఉండడంతో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మున్సిపల్ కమిషనర్ జానకీ రామ్‌సాగర్ ఆదేశాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ దుకాణంలో బుధవారం తనిఖీలు చేసి, దుకాణ యజమానికి రూ.5వేల జరిమానా విధించారు. ఆయన వెంట మున్సిపల్ జవాన్లు శ్రీనివాస్, రాజశేఖర్ ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగ్స్ అందజేత

నిజాంపేట, జూన్ 19: మండలంలోని కల్వకుంటలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 450 మందికి స్కూల్‌బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిళ్లను వీఎస్ఎ చారిటేబుల్ ట్రస్టు చైర్మన్ కంఠారెడ్డి కొండల్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు.

చేగుంటలో ..

చేగుంట,జూన్19: మండలంలోని చెట్లతిమ్మాయిపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందజేశారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, జూన్ 19: మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బుక్స్, ఏకరూప దుస్తులు అందజేశారు.

అంగన్‌వాడీల్లో నూతన ప్రణాళికపై శిక్షణ

శిక్షణలో పాల్గొన్న సీడీపీవో హేమభార్గవి

నర్సాపూర్, జూన్ 19: నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పూ ర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో హేమభార్గవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రణాళిక కచ్చితంగా అమలు చేసేలా పిల్లల్లో అభివృద్ధిని పర్యవేక్షించాలన్నారు. మూడు నుంచి ఆరేండ్ల పిల్లల సమగ్రాభివృద్ధి సులభంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బాధితుడికి ఎల్వోసీ అందజేత

తూప్రాన్, జూన్ 19: తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన తీగుళ్ల సుధాకర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ హరీశ్‌గౌడ్ ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్షా 20 వేల ఎల్వోసీని బాధితుడికి బుధవారం అందజేశారు.